
# ఆలోకం నవ్వింది!



బుట్టలో పాములా స్తబ్దంగా ఉంది ప్రకృతి. ఉక్కకు తిక్కరేగితే చెమట ధారలు కట్టి పెదాలు పిడచకట్టుతున్నాయి.

గుక్కడు నీళ్ళకోసం కొలనుగట్టు దిగాడు, ముత్యాలు!

ఆమడ దూరానికి పైగా కాలికికాలు కొట్టుకుంటూ నడిచాడు!.... కడుపులో తడిలేదు. కడిగి తోసినట్లున్న ఆకాశం మిడిసిపడుతూ మాడు అదరకొడుతూ ఉంది. నిండు గుంటను చూసే సరికి ముత్యాలు పిడచగట్టిన పెదాలపై ఆనందం తొణికిసలాడింది. దుమ్మునిండిన మడమలు నీళ్ళలో మునిగాయి. దోసెడు నీళ్ళకోసం రెండు చేతులు కలిపి నీటిపైకి వంగాడు. నీళ్ళను అందుకోబోయి అలానే నిలబడిపోయాడు.

తీసి కాస్తున్న ఎండ... ఆకు అల్లాడకపోయేసరికి అలలు సన్నగిల్లి నిర్మలంగా ఉన్న నీళ్ళు... ఆ నీటివెనక కాల ప్రవాహంలో ఉర్లిపడి, కాస్త దూరం దొర్లి, అక్కడ ఓ వెంట్రుకవాసి ఆధారానికి తగులుకొని కొట్టు మిట్టాడి నిలబడిన ఓ దీనాకృతి! ఎండి నెర్రెలు చీలిన పులక మడిలో

చచ్చీ చావక నిలబడిన నాచులా తలమీద తేసిపోయిన వెంట్రుకలు ... పేదరికం లేకుండా పెరిగిన గడ్డం.... పందెం వేసుకొని పీక్కుపోయిన కళ్ళూ బుగ్గలు!

అబ్బ! ఎంత వికారంగా ఉంది!

తన రూపం తనకే అసహ్యమనిపిస్తే చూసి సహించలేక గబగబ ఆ రూపాన్ని చెరిపేశాడు ముత్యాలు. రెండు దోసిళ్ళ నీళ్ళతో ప్రాణం కుదటబడింది.

ఈలోకంలో విభిన్న మనస్తత్త్వాలకు అనుగుణంగా తనవ్యక్తిత్వాన్ని మలుచుకొంటూ ముందుకు పోగల ఒక మహా చాణక్యుడి లాంటి ఆ బాట మిట్టపల్లాలను, వంక వాగులను, కొండ లోయలను దాటుకొంటూ వచ్చి అక్కడ ఓ అర్ధవృత్తాకారాన్ని రూపొందించు కొనింది. మనిషి తెలివికి చేతులొస్తే ఆ అర్ధవృత్తాకృతిలో కాస్త మట్టినితీసి అవతల పోశాయి. ఆ బాట మలుపులో వరసగా చింతచెట్లు, వెలగచెట్లు నాటాయి. నిజం సంగతి ఏమోగానీ, నీళ్ళు మాత్రం ఆ పల్లాన్ని గుర్తించి నిలకడగా నిలబడిపోతే అది మంచినీళ్ళ గుంట అయింది. ఆ కట్టపై నాటినచెట్లు నీటి పట్టుతో బాగా ఎదిగి, బాటసారులకు చల్లని నీడ నిస్తున్నాయి. కట్టమీద వెలగచెట్టుక్రింద ఓ బండను తిన్నెలా అమర్చాడు మరుజన్మలో మరింత సుఖాన్ని కోరుకొన్న జన్మజన్మలమీద నమ్మకమున్న ఓమనిషి! ఆ బండమీద కూర్చొని నీరసించిన కట్టెలాంటి శరీరాన్ని వెలగచెట్టుకు చేరవేశాడు ముత్యాలు.

కాసేపు ఊపిరి బిగబట్టి లోకాన్ని ఉక్కిరిబిక్కిరిచేసి ఆమీదట 'పోనీలే!' అని దయతలచి ఒక్కశ్వాస వదిలాడో వాయుదేవుడు– లేదు ఈ లాంటి అభాగ్యులను చూసి బాధగా నిట్టూర్చాడో కానీ, ఎంతలో ఎంతమార్పు! మెల్లగా చెట్లు కదిలాయి. అంతకంటె మెల్లగా కదులుతూ ఆకులు వీవనలయ్యాయి. ఆగాలి మంచినీటి మీదుగా వస్తూ, వస్తూ, చల్లదనంతో కూడా సువాసల్ని నింపుకొని హాయిగా వీస్తూ ఉంది. తల్లి ప్రేమలాంటి చల్లని నీడ... అంతకంటే చల్లని గాలి– నిద్ర చోటెరగలేదు. ముత్యాలు మాగన్నుగా కన్నుమూశాడు.

"గానిగెద్దులా ఉన్నావే! కండ్లు కనపళ్ళేదా! ఆ ఊళ్ళోకి పోరా అంత తిండి దొరికితింది!"

నీటికోసమో, చెట్టునీడ కోసమో నిలబడిన బాటసారులు కనీసం ' ఆకు వక్కయినా కొనకపోరులే!' అన్న అభిప్రాయంతో వెలగచెట్టుకు రెండు బారల దూరంలో పూరిగుడిసెలో చిల్లరంగడి జరుపుతున్న అలిమేలు కసిరింది. అదిరిపడి కళ్ళు తెరిచాడు ముత్యాలు! వంచిన తలెత్తకుండా దిగులుగా, గుంటకట్ట దిగిపోతున్నా డొక పదేండ్ల పిల్లవాడు! కాయకష్టం చేసి బతికేవాళ్ళ కండ్లకు వాడొక సోమరి. కలిగినవాళ్ళ దృష్టికి వాడొక ముష్టివెధవ! కాదు, గానిగెద్దు!!

"అసలు మనిషి, ఆత్మాభిమానం, సిగ్గు, బిడియం– మొదలైన సుగుణాలను వదిలి, సాటి మనిషి ముందు 'దేహీ!' అని ఎందుకు చెయి చాపుతాడు?– అది పుట్టుకతో వచ్చినా గుణమా? లేదు పరిస్థితుల ప్రోద్బలమా?" ఈ భావన మనసులో మెదిలిందేమో? బాగా పెరిగిన గడ్డాన్ని వేళ్ళతో రాచి, తడిమిచూసి పెదవి విరిచాడు ముత్యాలు. అంగడికి బేరం వచ్చిందేమో? అంతలోనే అప్యాయతను ఒలకబోస్తుంది అలిమేలు. కనుచూపుమేరలో ఎర్రని ఎండలో ఎద్దులు

లాగలేక లాగుతూంటే 'కిర్రు'మని శబ్దంచేస్తూ తిరుగుతూ నూనె గానుగ. ముత్యాలు మనస్సు ఆ గానుగతో పోటీపడ్తూ ఇరవై సంవత్సరాల వెనక్కు!

అప్పుడు తన వయస్సు సరిగ్గా ఆపదేళ్ళ పిల్లవాడి కున్నంతే. ఆ వయసులోనే తాను లోకం మీద పడ్డాడు. ఆకలి బాధకు తట్టుకోలేక, సంపాదించే మార్గం తెలియక తెలిసినా అందుబాటులో లేక, పిడికెడు కూటికి బోలెడు తిట్లు తిన్నాడు. చాలాసార్లు చద్దామని ప్రయత్నించాడు. తానేమో ఎలుగెత్తి ఆహ్వానించినా తనవైపు చూడనయినా చూడలేదు చావు. అదేమి చిత్రమో, కావాలని కోరుకొని అహరహం కలలు కని, పరితపిస్తే అందుబాటు కావు కొన్ని! వద్దనుకొంటే కూడా అనుకోకుండా వచ్చి నెత్తిన పడతాయి మరికొన్ని!! లేకపోతే గీచిన గీతలా సవ్యంగా సాగిపోవలసిన బతుకును, వంకర టింకరగా చేసి పారేసింది ఆ ఒక్కమాట!

ఆ రోజు తాను ఇంట్లోనే కూర్చొని అయ్యవారు చెప్పిన ఇంటి పాఠాన్ని రాసుకొని ఉంటే ఇంత సంత జరిగేది కాదు. రాయాలనే అను కొన్నాడు. పలకా పుస్తకాలు తెచ్చి ముందరేసు కొన్నాడు. పుటికమీద బుడ్డీదీపం నిశ్చలంగా వెలుగుతూ ఉంది. పుస్తకం విప్పబోయాడు. అంతలోనే పాట వినిపించింది. మనస్సు పాఠాలమీదనుండి పాటమీదికి మొగ్గింది. పాట వినిపిస్తున్న వైపు చూపు మరలడంతో బయటి తట్టు చూశాడు. దాదాపు జాముర్రాత్రి కావస్తూ ఉంది. పుచ్చ పూసినట్లు పున్నమినాటి పండు వెన్నెల. చుట్టూరా పచ్చని పైరుచేలు. ఆ చేలు ఉండుండి చిలకరించే చల్లని గాలులు. ఆ గాలి మోసుకొస్తున్న పాట. జానపద గేయాల్లో వజ్రాల మూట!

*"ఈదిలో గుమ్మిడి - ఇంటెనక సిక్కుడు*
*పోరాని కల్లకంత - పాయరా తీగె*
*నేనేమి రంకాడితి?*
*నా రంకయిన తెలపరా? రాజాతి మగడా?*
*నేనేమి రంకాడితి??"*

కమ్మగా వినిపిస్తూ ఉంది పాట. తనకు తెలియకనే తన కాలు లయ అందుకొనింది. ఒక్క అడుగులో ఎగిరి నడివీధిలో పడ్డాడు.

పంచె మోకాలిపైకి ఎగతీసి గోచిపెట్టి, కాలికి గజ్జెకట్టి, సుంగువిడిచి తలకు పాగా చుట్టి, జోడు కోలాట పుల్లలు చేత బట్టి 'కోపు' పట్టారు కుర్రవాళ్ళు, పాట పాటకు కోలాటంపుల్లల లయ, లయకు దగ్గ అడుగు, దుమ్ము లేచిపోతుంటే, ఆ ఊళ్ళో వాళ్ళంతా రచ్చబండమీద, ఇంటిముందు అరుగులమీద కూర్చుని చెవులు అప్పగించి వింటున్నారు.

ముత్యాలు హృదయం గంతులేసింది.

ఒక జత కోలాటపుల్లలు అందుకొని తాను కూడా జట్టు లో కలిసిపోయాడు. పాట తారస్థాయిని అందుకొనింది. 'అయ్ .....హ!ఆయ్!...హ!' అని అడుగు పాటకు తోడు కలిసింది. ముసలి ముతక గతానుభవాల స్ఫూర్తితో 'బలె బలె' అని ప్రోత్సహిస్తున్నారు. లోతుబావుల్లో నీళ్ళుతోడి వెతలుపడ్డ రైతాంగం వేసవి వెన్నెల్లో, కాస్త సేద దీర్చుకొంటున్నారు.

"ధూత్" అన్నాడు ఉన్నట్లుండి రెడ్డి కొడుకు.

కడవ పాలల్లో ఒక ఉప్పుగల్లే అయిందామాట!

ఆ మాటతో కోలాటం లయ తప్పి ఆగిపోయింది. తన చెంప 'ఛెళ్లు' మనింది. తానేమీ గ్రహించలేకుండా బిత్తరపడి తేలమొహం వేస్తే తన ఇష్టమొచ్చినట్లు నోరు పారేసుకొంటున్నాడు రెడ్డి కొడుకు. ఆ జనంలో నుంచి ఒకనడికారాయన లేచివచ్చాడు. "ఏం జరిగింది నాయినా!" అని అడిగాడు. 'చూడండి! గాడిద!!– చేత కాకపోతే ఊరికే ఉండాల! ఎవుడు పిలిచారీ వెధవను తాంబూళం పెట్టి?... చేతి కేసి కొట్టాడు" అంటూ కొర కొర చూస్తూ, చేతివ్రేళ్ళు నొక్కుకున్నాడు రెడ్డి కొడుకు.

దెబ్బ తగిలిన గుర్తులేమీ కనిపించలేదక్కడ!

"పోనీలే నాయినా! అబ్బ అమ్మకు పుట్టిన బిడ్డయితే వాడికి అదుపు ఆజ్ఞలుండి ఏడస్తాయి. ఈ అతినాయాలికత ఎక్కడా యింతేలే" అని సర్దుబాటు చేశాడు పిలవని పెత్తనం చలాయించి!

ముత్యాలు గుండెల్లో ముండ్లు గుచ్చుకొన్నాయి. కండ్లల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. గుండెగుప్పిటబట్టి అక్కడనుండి చల్లగా జారుకొన్న ఓ స్త్రీ ఆకారాన్ని ఎవ్వరూ గమనించలేదు. ఒక్క క్షణం ముత్యాలు అక్కడ నిలబడలేక పోయాడు. మెల్లగా ముందుకు సాగాడు. రచ్చబండ దూరమవుతున్న కొద్దీ పిచ్చినవ్వులు చెవుల్ని తూట్లు పొడుస్తున్నాయి.

అవును! తాను ఈ విషయాన్ని గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. అసలు ఆలోచించే అవసరమే లేకపోయింది. ఏదో కూలినాలి చేసి అమ్మ అంతకూడు ముద్దుమురిపాలతో రంగలించి తినిపిస్తే, తాను బడికి వెళ్ళడంగా పదేండ్లు గడిచినట్లే తెలియలేదు. కానీ, ఈనాడు నలుగురిలో తలెత్తలేని అవమానం జరిగింది. దీనికంతకూ కారణం అమ్మ!– 'ఈ వేళ ఏమైనా సరే!... అమ్మను తప్పక నిలదీసి అడగాల్సిందే!' అనుకొనేసరికి తన కాళ్ళు కాస్త వేగాన్ని పుంజుకొన్నాయి. ఇంట్లో అడుగుపెట్టాడు. పాత పూరిల్లు... పరిగపొదలాంటి పై కప్పు నుండి వానజల్లు, వెలుగు వెన్నెలలు దోబూచులాడే ఇల్లు... వెన్నెల పొడలు నేలంతా మింటి చుక్కల్లా మినకరిస్తున్నాయి– తన ఆలోచనల్లా! పుటికమీద బుడ్డీ దీపం గాలికి రెపరెపలాడుతూ ఉంది. ఎదురైన అమ్మ మొగం అంతకంటె 'వెలవెల' పోతూ ఉంది!

"ఏంవిరా అబ్బోడా? పలకా పుస్తకాలు ఎక్కడివక్కడ పారేసినావు. పుటికమింద బుడ్డీదీపం పుటికమిందనే ఉండాది. ఆర్పేసి గూట్లో అయినా పెట్టకపోతివి. ఇప్పుడే ఇట్లయితే ఎట్లరా?" గుండె పిండే బాధకు ముసుగేయాలని నసిగింది అమ్మ. ఆ మాటలు తన చెవుల్లో పడలేదు కానీ, పడిన మాటలు మాత్రం గుండెను తూట్లు పొడుస్తున్నాయి.

"చెప్పమ్మా?... మా నాన్న ఎవరో చెప్పు?"

చూపులు సూటిగా ఉన్నాయి. మాటలు ధాటిగా ఉన్నాయి. మేక కంటపడ్డ లేత ఆకులా వణికిపోయింది ఆమె!

"నిజమే! తాను ఆయనచేత వంచింపబడింది. తన జన్మకారకు లెవరో తెలియని చిన్నతనంలోనే పంచన చేర్చి పెంచినారు. తనకు వయసు, వయస్సుతోపాటు అందం, అన్నిటికీ మించి అందుబాటు, అర్ధాంగి చెల్లుబాటు- జరిగేసరికి వినియోగించుకొన్నారు 'పెండ్లి' సాకుతో. వయస్సులు పోల్చి చూస్తే తండ్రీ బిడ్డలే! అయితే కృతజ్ఞత అనేది ఈ లోకంలో ఉంటే అది మొదట తన గుండెల్లోనే పుట్టినట్టు అంగీకరించింది వివాహానికి, మనస్సు అంగీకరించక పోయినా! తీరా తన కడుపు పండబోతున్న సంగతి తెలిసే సరికి ఆయనకు తన అంతస్థూ, కులం, గోత్రం, గౌరవం అన్నీ తెలిసివచ్చాయి. పోనీ, అంతటితో వదిలి పెట్టినా బాగుండేది. పలుకుబడితో పది మందిని పంచన చేర్చి తన్ను వాళ్ళముందు నిలబెట్టాడు- ముద్దాయిలా. వాళ్ళు చేరిన కారణం, వినబోయే మాటలు ఊహించుకొనేసరికి తల కొట్టేసినట్లయింది. అయినా నిలబడకపోతే విధి లేదు. చూస్తూ చూస్తూ ఉండగానే ఆయన గొంతు బాగా గద్గదికమై పోయింది. కళ్ళు చెమ్మ గిల్లాయి. ఎవరినీ ఉద్దేశించకుండా, దీర్ఘ స్వగతంలా, తనలో తాను గొణుక్కున్నాడు.

"చిన్నప్పటి నుంచి పెంచి పెద్దదాన్ని చేసినాను. కడుపులో పుట్టిన బిడ్డకంటె బాగా చూసుకున్నాను. అంతకంటె బాగా ఆదరించినాను. కాలం కలిసొస్తే ఎవుడి చేతుల్లోనైనా పెడ్దామనుకొంటే..." ఆపై మాటలు పెగలనట్లుగా అసలే గద్గదికమైపోయిన గొంతు బాగా పూడకపోయింది. ఆ మాటలు చెవిని పడుతుంటే, ఎదమీద ఎవరో సమ్మెటతో బాదినట్లుంది. విని తట్టుకోలేక ఒక్క విసురులో లోనికి వెళ్ళింది వాళ్ళమొగం చూడలేక! కుములుతున్న మనస్సు మాత్రం మళ్ళీ వాళ్ళ చుట్టూ తిరుగుతూనే ఉంది.

పాపం! కాస్త తమాయించుకొని మరలా ఆరంభించాడు ఆ పెద్ద మనిషి. "అనరాదు కానీ- అనరాని, వినరాని పనే జేసింది ఈ బుద్ధిలేని గాడ్ది! అదిచెయ్యరాని పనిచేసి నాచేత చెయ్యరాని...! రాఁవ! రాఁవ!! ఎట్లా బరాయించాల ఈ బాదను?"

ఆ అభాండాన్ని భరించలేక కుప్పగ కూలిపోయింది తాను!

"ఎందుకు బావా? దీని కింతగా వగిసేది? నాలుగుదన్ని మెడబట్టి అవతలికి గెంటేస్తే పోతింది. నీ ఎర్రిగానీ! హ్హహ్హహ్హ! కుక్కతోకకు దబ్బలు కట్టాలనుకున్నావ్?" ఒక బుద్ధిమంతుడి సలహా!

కల్పించిన మాట! కలవాళ్ళ నోట్లో తిరుగులేని సత్యమయింది. నాటకం బాగా రక్తికట్టింది. తన బతుకు నడివీధిలో కడిగిపోసినట్లయింది. ఆత్మహత్య పాపానికి భయపడి, కడుపు తీపితో ఊరుకాని ఊరు చేరింది. ఓ కొడుకును కనుక్కొనింది. ఆ కొడుకు ఈనాడు ఎదిగి, ఎదట నిలబడి, నిలదీస్తున్నాడు "ఎవరు తన తండ్రి?" అని.

"ఏమని చెప్పేది?"

"ఏమో, ఎందుకు చెప్తావ్?... జరిగింది జరిగినట్లుగా చెప్పు!"

"చెప్తే నమ్మతాడా?"

"నమ్మించాలి మరి?"

"అంత అవసరం ఏమొచ్చింది?"

"అవసరముండేగా అడుగుతున్నాడు!"

"అందరి అవసరాలకు నేను బాధ్యురాలినా?"

"అందరి సంగతీ అలా పక్కనపెట్టు. వాడు నీ బిడ్డ !!?

"అందుకే గదా ఇంకా బతికుండేది."

"నీ బతుకు వాడికి కంటకప్రాయంగా తయారయింది!"

"అయితే చావనా?"

"చచ్చినా మచ్చ మచ్చే!"

మునంపట్టి సాగిపోతున్న ఆలోచనలు ఓ ముడిపడలేదు ఎంత ఆలోచించినా.

"చెప్పమ్మా ! నే నడిగినదానికి బదులు చెప్పు"

"ఇప్పు డెందుకులేరా ఈసోదంతా? పెద్దోడైతే నువ్వే తెల్సుకుంటావులే!"

నోట్లోమాటా నోట్లో ఉండగానే ఆమె గబగబ వెళ్ళిపోయింది. మారు మాట్లాడకుండా అక్కడినుండి కదిలాడు ముత్యాలు. గుండె బరువెక్కింది. అడుగుమీద అడుగ్గా వెళ్ళి పడుకొన్నాడే కాని నిద్రపట్టలేదు.

"అసలు అమ్మ తప్పు చేయకుంటే ఎందుకిలా కప్పిపుచ్చుతుంది. తండ్రిని తెలుసుకొనే హక్కు- పోనీ అదృష్టం బిడ్డకులేదా? 'నీకెందుకిదంతా అంటుందే!'- పోనీ, అమ్మకు నాదగ్గర దాపరికమెందుకు? ఇదే నిజమైతే- ఉదయాన ఊళ్ళోవాళ్ళ మొగం ఎలాచూడాలి?"

ఆలోచించే కొద్దీ గుండె కుతకుత ఉడికిపోతూ ఉంది. చూరుకప్పు బొరియలగుండా తొంగిచూస్తూ చందమామ "పిచ్చినాన్నా! పడుకొని నిద్రపోరా!" అని మందలిస్తున్నాడు. ఎక్కడో నక్కల అరపులు... జొన్న చేలవద్ద కావలి కాస్తున్నవాళ్ళ అదిలింపులు... పూరింటి అరుగుమీద పడుకొని ఉన్న ఓ స్త్రీ మూలుగులు... అర్ధరాత్రి సమయంలో అదో విధమైన రొద... ప్రకృతి పసిపిల్లల పల్లెకూటంలా ఉంది.

మరసటి . దినం ఉదయాన్ని ఊహించుకొని ముత్యాలు తుంగచాపమీద గడగడ వణికిపోతున్నాడు. తెట్టెమీద తేనెటీగల్లా ముసిరిన ఆలోచనలు.... ఆగని కాలం.... అర్ధరాత్రికి పైగా దాటినట్లుంది. మెల్లగా పైకిలేచాడు. పిల్లిలా అడుగులు వేస్తూ ముందుకు నడిచాడు. ఓ క్షణం నిలబడి వెనక్కు తిరిగి చూశాడు. తొమ్మిది నెలలు మోసి యమయాతనతో ప్రసవించి, పలుబాట్లుపడి పది సంవత్సరాలు పోషించిన అమ్మ! పైటచెరగు పాన్పుగా కటికనేల తల్పంగా అరుగుమీద అస్తవ్యస్తంగా పడి ఉంది. హృదయం ద్రవించింది. కండ్లు వాగులయ్యాయి. ఆ వాగుల్లో ఉవ్వెత్తుగా లేచిన సుడిగుండంలా వెలువడిన 'అమ్మా' అన్న పిలుపును పెదాలు నొక్కిపట్టాయి. ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఆ దృశ్యాన్ని చూసి ఊళ్ళో వాళ్ళంతా వికటంగా నవ్వుతూ తనవైపు అదోవిధంగా చూస్తూ చెవులు కొరుక్కుంటున్నారు. ఒక పక్క పౌరుషం. ఒక పక్క అవమానం. తన్ను సమస్థాయిలో లాగుతుంటే, చూస్తూ సహించలేక

అటు చూడలేక మొగాన్ని రెండు చేతులతో కప్పుకొని వెనక్కు తిరిగాడు. ఆ అర్ధరాత్రిలో ఎక్కడికో? ఎందుకో? గమ్యం తెలియని గమ్యానికి బయలుదేరాడు!

ఆ మీదట తను జీవిత గుడారాన్ని తిండి దొరకని చోటునుండి కాస్త తిండి దొరికేచోటుకు రవాణాచేస్తూ.... అక్కడ తిండికి బదులు తిట్లు తింటూ.... ఏ చెట్టునీడనో తలదాచుకొంటూ– మరో ఏడెనిమిది సంవత్సరాలు నెట్టాడు. ఆ ప్రయాణంలో ఓ సారి రైలు ప్రయాణం. నడి రేయి... క్రిక్కిరిసిన మూడవతరగతి రైలు పెట్టె... ఎక్కడివాళ్లక్కడ నిద్రమత్తులో ఊగుతున్నారు. వాకిలివద్ద కాస్త చోటుచేసుకొని నిలబడి ఉన్నాడు. కాళ్ళు పీకుతూ, కళ్ళు మూతలుపడుతున్నాయి. చాల దగ్గరలో 'గుర్... గుర్' మన్న శబ్దం వినిపించింది. అటువైపు చూశాడు. అంత అవస్థలో కూడ చూస్తుంటే తనకు నవ్వు వచ్చింది. ఓ లావు పాటి ఆసామి దానికి మించిన లాభసాటి వ్యాపారం లేదన్నట్లుగ పెట్టె తల గడగా, సామానులుంచే అటక పడకగా గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు.

అదొక చిన్న రైల్వేస్టేషన్. ఆ ప్రదేశమంతా చీకటి ఒడిలో ప్రశాంతంగా ఉంటే ప్లాట్‌ఫారం కొనల్లో పోర్టరు పొదుపు ఉద్యమంలో ఇరుక్కొని కొన ఊపిరితో ఉన్న రెండు కిరసనాయిలు దీపాలు. ఆ అపరాత్రిలో రైలు ఎక్కే ప్రయాణికులుకానీ దిగేవాళ్లు కాని కనిపించలేదు. ఎందుకలాంటి స్టేషన్‌లలో ఆగడం అని ఆలోచిస్తుంటే "అయ్యో! నా పెట్టె! ... నా పెట్టె!!" అన్న ఆగడం చెవిని పడింది. అందరూ అటువైపు చూశారు. పాపం! అటకమీద నిద్రమత్తులో గురక పెడుతూ ఉండిన ఆసామి పెట్టెకోసం వెదుకుతూ దిగాలన్నా దిగలేక తంటాలు పడుతున్నాడు. ఇంతవరకు పెట్టె అతనికి తలగడగా ఉండటం అంత నిద్రలోకూడ అతడు అప్పుడప్పుడు పెట్టె ఉందో లేదో అని తడిమి చూసుకోవడం– గమనిస్తూనే ఉన్నాడు ముత్యాలు. అంత లోపలే మాయమయింది. 'ఆశ్చర్యంగా ఉందే!' అనుకొని ప్లాట్ ఫారంవైపు చూశాడు. అంతవరకు తన ప్రక్కన్నే నిలబడి ఉండిన ఓ మనిషి నడక పరుగ్గా ప్లాట్‌ఫారం మీద! చేతిలో పెట్టె ఉంది. ఆ పెట్టెను పరిశీలించి చూశాడు. సందేహమేలేదు. నిజంగా ఆ పెట్టె ఈ లావుపాటి ఆసామిదే! అంతే 'దొంగ! దొంగ!!' అని అరుస్తూ ఎగిరి ప్లాట్ ఫారం మీద దూకి ఆ మనిషి వెంటపడ్డాడు. 'దొంగ' అన్నమాట చెవిని పడటంతో అందరూ "దొంగ ! దొంగ!!" అని ఒకటై అరిచారు. ఎవరు దొంగో! ఎక్కడి దొంగో!! అర్థం కాకపోయినా, తాము చూడకపోయినా.

స్టేషన్ మాస్టర్ ఎర్రదీపం చూపాడు. బయలుదేరపోతున్న రైలు ఆగింది. ఊహించని ఈ సంఘటనతో పెట్టెను వదిలిపెట్టి చీకటిలో కలిసిపోయాడు దొంగ. 'పోతే పొయ్యాడు వెధవ! సొత్తు దక్కిందిలే!' అని పెట్టెను చేతి కందుకొన్నాడు ముత్యాలు. అంతే! పెట్టె చేతికి వచ్చిందో, లేదో? నాలుగు చేతులుకలిసి తనను పరామర్శిస్తే, ఆ గుంపును చీల్చుకొని వచ్చిన పోలీసు ఇంకా బాగా సత్కరించాడు.

మాసిన గుడ్డలు... పెరిగిన గడ్డం... సంస్కారాన్ని చవిచూడని జుట్టూ... తానొక దొంగని నిరూపించడానికి సహకరిస్తే– నాలుగేళ్ళు జైలుకమ్ములు లెక్కపెట్టాడు గోళ్ళు గిల్లుకుంటూ! అదికూడా ఆషామాషీగా కాదు. ఏవైపు నుండి ఏ కమ్మిని చూపించినా దాని నంబరు ఖచ్చితంగా

చెప్పగల సామర్థ్యం అలవడేవరకూ లెక్క పెట్టాడు. ఈ సామర్థ్యాన్ని గుర్తించిన జైలు అధికార్లు అతనిని వదిలిపెట్టారు.

ముత్యాలు బయటపడ్డాడు. కాదు– ఈ సంతలో అడుగుపెట్టాడు. నాలుగు గోడలమధ్య కూర్చొని పాపం! అమాయకుడు ఏమేమో ఊహించు కొన్నాడు. కానీ, ఇక్కడ ఒకటీ తన ఊహకందలేదు. ఊహ కందింది అర్థం కాలేదు. ఏమిటో మరి?– రైళ్ళు పరుగెత్తుతూనే ఉన్నాయి. మోటార్లు కార్లు, లారీలు పంతం వదలడంలేదు. కొనడం, తినడం, లేక పోతే ఏడవడంతో మనుషులు పోటీ పడుతున్నారు. పొద్దు పుట్టుతూ ఉంది. పోతూ ఉంది. ఎవడి తాపత్రయంలో వాడు. ఇలాంటి స్థితిలో తనలాంటి వాళ్ళను గురించి ఆలోచించడానికి, లేదు– కనీసం కాస్త సానుభూతి చూపడానికి ఎవరికి తీరిక ఉంటుంది? తన పిచ్చి కానీ!

ఈ సంతలో తన ఉనికిని గురించి తాను ఆలోచించుకోవలసి వస్తే తన చిన్ననాటి విషయం ఒకటి గుర్తుకొచ్చింది. తన పూరింటి నట్టింటి గూట్లో ఓ బుడిగ హుండి ఉండేది. అమ్మ పావలా కూలి డబ్బుల్లో ఓ కానీ మిగిల్చి అందులో వేసేది. శనివారంపూట ఉపవాసం ఉండేది. ఆ హుండీని పూజించేది. "ఇదేంవిటమ్మా?" అని అడిగితే "ఏడుకొండల వాడి ముడుపు నాయనా!" అంటూ ఉత్తరంగా మళ్ళీ రెండుచేతులు జోడించేది. అమ్మ అంత భక్తిగా పూజించిన ఆ దేవుడితో తన గతిని మొరపెట్టుకోవాలన్న ఆలోచన కలిగింది. ఆలోచన ఆచరణలో పెట్టే ప్రయత్నంలో నడుస్తున్నాడు ముత్యాలు. తిరుమల కొండపైన దేవుణ్ణి చూడాలన్న కృతనిశ్చయంతో నడుస్తున్నాడు ముత్యాలు. మెదడు తుట్టెను ముసురుకొంటున్న ఆలోచన తేనెటీగల్ని తరిమికొడుతూ నడుస్తున్నాడు ముత్యాలు!

నడిమిట్టన నీలుగుతూ ఉండిన సూర్యుడు కాస్త పడమటి పక్కకి వాలి మబ్బులమాటున మినకరిస్తున్నాడు. కాళ్ళు కుక్కలు పీకినట్లు లాగుతున్నాయి. బాటప్రక్కన్నే ఊడలు దిగిన మర్రిచెట్టు. ఆ చెట్టు క్రింద కూర్చున్నాడు ముత్యాలు. కడుపు మండిపోతూఉంది. చేతిలో చిల్లిగవ్వలేదు. ఏమిచేయడానికి తోచకుండా ఆ చెట్టువంక పరిశీలనగా చూస్తున్నాడు. కనువిప్పీ విప్పని 'కార్ కార్' మంటున్న గువ్వపిల్లలు. చిదుగు బొదుగు గూటిలో తల్లిగువ్వ మేత ముక్కు కందిస్తూ ఉంటే కేరింతలు కొడుతున్నాయి. గూడు అల్లుకోవడానికి యాతన పడుతున్న సాలెపురుగును కబళిద్దామని పొంచి ఉంది ఒక బల్లి. రెండు గువ్వలు ఆకుల మాటున ఓ రెమ్మమీద కూర్చుని మూగనోము నోస్తున్నాయి. ఒక లోకాన్నే తలపింప చేస్తున్నట్లున్న ఆ మర్రిచెట్టుకు ఆ జీవరాసులపై ఉన్నంత ప్రేమ ఈ మనుషుల్లో ఉంటే?– ఒక చిత్రమైన ఆలోచన మనస్సులో మెదిలితే ముత్యాలు పెదాలపై ఒక చిరునవ్వు!

కనుచూపు మేరలో తిరుపతి. అతి సమీపంలో విశ్వవిద్యాలయ భవనాలు సర్వశోభాయ మానంగా ఉన్నాయి. మధ్యాహ్న భోజనానంతరమేమో కళాశాలల్లో చదివే అమ్మాయిలంతా చకచక నడిచిపోతూంటే సందెడు పుస్తకాల బరువుతో సన్నని నడుములంతా ఒగిరిస్తున్నాయి. వాళ్ళను చూస్తుంటే ముత్యాలు కళ్ళు చెమ్మగిల్లాయి. అవును! తన చదువు సరిగ్గా సాగివుంటే, తానుకూడా ఈపరకు ఇలా కళాశాలల్లో చదువుతూ ఉండవలసింది. ఇంకా చదువా? ముప్పై

ఏళ్ళు నెత్తికెక్కి సవారి చేస్తుంటే! ఈ పాటికి ఏదైనా ఉద్యోగం చేస్తూ అమ్మను పోషిస్తూ ఉండే వాడు. అమ్మ!.... ఏమైపోయిందో, ఏమో? తనలాంటి ఓ నిర్భాగ్యుణ్ణి కని, గాలికి వదిలేసి, తాను మాత్రం తన బతుకు బతుకుతూ ఉంటుంది. తాను సమాజపు కట్టుబాట్లు తెంచుకొని తనకు ఓ కట్టుబాటు లేకుండా చేసింది లోకంలో! నలుగురి నోళ్ళల్లో నానేటట్లు చేసింది? ఆమెను గురించి ఆలోచించడం కూడా...!

కామెర్లకంటి వాడికి ప్రపంచమంతా పచ్చగా కనిపించినట్లు, పిరికివాడి కంటికి లోకమంతా అనుమానాస్పదంగా కనిపిస్తుంది. "నీది తప్పుడు పుట్టక! ఈ సంఘంలో నీకు తావు లేదు" అని వేలెత్తి చూపించే ఓ అనుమానభూతం ఆవరిస్తే ఆ మర్రిచెట్టు బోదెకు అనుకొని పరధ్యానాన్ని పరామర్శిస్తున్న ముత్యాలు 'కెవ్వు' మన్న కేకతో ఎగిరిపడ్డాడు. ఒక్క 'సడన్ బ్రేక్'తో లారీని నిలబెట్టిన 'డ్రైవరు' హమ్మయ్య!' అని నిట్టూర్చి పట్టిన చెమటను కాస్త తుడుచుకొని ముందుకు సాగి పోయాడు. ముత్యాలు ఒక్క లగువులో పాపను జవురుకున్నాడు. పాపం! గడ గడలాడుతూ తన మెడకు బల్లిలా హత్తుకపోయింది, ఆ కసుగందు. అలానే మర్రిచెట్టు కిందికి మోసుకొని వచ్చాడు. కింద దింపాడు. చెట్టులోనే రంగు తిరిగిన నిమ్మపండులాంటి పసిమి చాయ.... నాలుగైదు సంవత్సరాల వయస్సు ఉంటుందేమో!..... ముద్దులమూట కట్టినట్లుంది పాప. చెవులో లోలకులు, మెడలో గొలుసు, మంచి దుస్తులు, కలిగినయింటి బిడ్డగానే ఉంది. దడ తీరలేదేమో? ఇంకా వణికి పోతూనే ఉంది.

"నీ పేరేమిటమ్మా?" అడిగాడు ముత్యాలు.

"రమ" మురిపాల మూటలోనుండి ఓ ముద్దు– కాదు ఓ మాట జారిపడితే ముత్యాలు హృదయం ఆనందాన్ని వారు కొనింది.

"మీ ఇల్లెక్కడమ్మా"

చేయెత్తి చూపింది పాప! అటు చూశాడు. బాటకు దక్షిణంగా, కవలపిల్లల్లా కావిరంగుతో ఒకదాన్ని చూసినట్లు మరొకటిగా ఓ అయిదారు మేడ లున్నాయి. ప్రతి ఇంటిచుట్టూ ప్రహరీగోడ... ఆ గోడ లోపల తోట...... ఆ తోట లోపల మధ్యగా మేడ.. అలాంటి మేడల్లో పుట్టిన పాపలు ఇలానే ఉంటారేమో? అనుకొన్నాడు ముత్యాలు.

"....... అయితే ఈ ఎండలో ఎందుకిలా వచ్చావమ్మా?"

"ఆలుకోటానికి!" చాలా తేలిగ్గా బదులు చెప్పింది రమ.

"ఇంటి ముందరో లేదు ఈ చెట్ల కిందనో ఆడుకోకుండా బాటకాప్రక్క కెందు కెళ్ళావమ్మా? ఎప్పుడూ బస్సులు, లారీలు, కార్లు పరుగెత్తు తుంటాయే. తప్పుగదా!" మెల్లగా మందలించాడు ముత్యాలు.

"నా బంతి పోయింది! బంతికోసం నే నెల్లాను!" చేతిలోని బంతి వైపు అదోలా చూస్తూ, తనకు చూపింది రమ.

పాప తెలివికి పూబంతి అయింది ముత్యాలు మనసు. తనవిదీర ఒక్క ముద్దు పెట్టుకోవాలన్న ఒక పిచ్చికోరిక కలిగింది. ఆ కోరికతో బాల్యస్మృతులు లీలగా మనస్సులో మెదిలాయి. అవును! ఎప్పుడైనా, ఏదైనా అమ్మ అడిగినదానికి తడుముకోకుండా చిలిపిగా బదులు చెప్పితే ఆమె గుండె కొండంత అయ్యేది. గుండెల కదుముకొని, "ఎంత తెలివమ్మా నా దొరకి! ఏడూళ్ళు ఏలి తీరతాడు!" అంటూ సంతృప్తిగ నిట్టూర్చేది. మాటల్లో కోరికలు కోరికలుగానే నిలిచిపోతే, ఆ నిట్టూర్పుల్లో బాధలు మాత్రం తన్ను వదలిపెట్టలేదు. కానీ తాను గమనిస్తూనే ఉన్నాడు. ఇల్లు వదిలింది మొదలు ఈనాటి వరకు ఇలాంటి సంఘటన కానీ, ఆలోచించే ఆస్కారం కానీ కలగలేదు. ఈ రోజు తనకు ప్రేమకు అర్థం తెలిసి నట్లయింది. అందుకే రెండు చేతులతో ఆ అమ్మాయిని పొదివి పట్టుకొని అక్కున చేర్చుకోబోయాడు. మాసిన గుడ్డలు, గిజిగాని గూడు లాంటి గడ్డము, నెత్తిన ముంతనీళ్ళు చల్లుకొని ఎన్నాళ్ళయిందో? అదో రకమైన వాసన, పాపం! రమకు తగని అసహ్యం కలిగిందో! ఆ ఆకారానికి జడసుకొనిందో- కానీ పట్టు తప్పించుకోవాలని విలవిల కొట్టుకొంటూ ఉంది. ముత్యాలు అదేమీ గమనించే స్థితిలో లేడు. అంతలోనే తన చెంప 'ఛెళ్ళు' మనింది. ఆ దెబ్బతో పట్టువదిలి పైకి లేచి నిలబడ్డాడు. చెంపమీది చేతివ్రేళ్ళ గుర్తులను మాసినగడ్డం మూసి పెట్టినా కెంపు తిరిగిన కనుగుడ్లు మాత్రం కనీళ్ళను కప్పిపుచ్చలేక పోయాయి. ఆణిముత్యాల్లా టపటప నేలరాలి ఇంకి పోయాయి- అది వాటి లక్షణం కాబట్టి!

"ఎవడ్రా నువ్వు.... ఒంటిగా చేతికి చిక్కిందని గొంతు పిసికి పారేద్దామను కొన్నావా?... ఉండు నిన్ను పోలీసుల కప్పచెప్పుతాను!"- అంటూ పొగలు గక్కుతున్నాడు రమ తండ్రి నీలమేఘం.

"అదేనండి! నేను చెప్తే మీరేమి పట్టించుకోక పోతిరి. పాప అరిచినట్లుంది చూడండి అంటే- పసిపిల్లలతో కలిసి గోల చేస్తూ ఉంటుందంటిరి, ఇప్పుడే గనగ రాకపోతే పాపగతి ఏమై ఉండేది?.... అయ్యో! నా చిట్టితల్లీ!!" అంటూ పాపను జవురుకొనింది- రమతల్లి లీలావతమ్మ.

ఆ స్థితిలో కూడ ఆ ఇద్దరిని ఒక్క సారి పరీక్షగా చూసి ఓ చిరునవ్వు నవ్వాడు ముత్యాలు!

"..... పైగా నవ్వుతావటరా నువ్వు? నే నెవరనుకొన్నావో ఏమో? అనుకొంటే నిన్ను నిముషాలమీద అరెస్టు చేయించగలను?" గుడ్లురుముతున్నాడు నీలమేఘం.

వింతగా అతనివైపు చూస్తున్నాడు ముత్యాలు. ఇదంతా ఏమీ అర్థం చేసుకోలేని రమ మాత్రం తల్లి చంకలో బిక్క చూపులు చూస్తూ ఉంది. ఏమో చెప్పాలని ఆరాటపడే ఆ పసి మనసు తండ్రి కోపాన్ని చూసి నోరు కదపలేకపోయింది.

"ఎవడో పిచ్చి వెధవలాగున్నాడు. వాడితో ఎందుకు పోనీలెండి!" అంటూ రమను తీసుకొని వెళ్ళిపోయింది లీలావతమ్మ. మళ్ళీ ఒక్కసారి నవ్వాడు ముత్యాలు.

"అయ్యో! పిచ్చితండ్రీ!! పోలీసులు జైళ్ళు నాకేమీ కొత్తగాదు. మీరనుకొన్నంత పనిచేయడానికి కూడ సమర్థులే. అయితే నేను నవ్వడమంతా నా అదృష్టాన్ని తలుచుకొని!" అన్నట్లుంది ఆ నవ్వు! ఆ నవ్వుతో మరీ రెచ్చి పోయాడు నీలమేఘం.

"ఏరా! నీకంతా నవ్వులాటగా ఉంది కదూ?!..... అయితే ఉండు!" అంటూ ఒక్క ఊపులో వెళ్ళాడు నీలమేఘం.

ఇక్కడ ముత్యాలు తన్ను గురించి, ఆపైన భగవంతుని అస్తిత్వాన్ని గురించి కాసేపు ఆలోచించవలసి వచ్చింది. ఏమిటో తన బతుకు తనకే అర్థం కాలేదు. పుణ్యానికిపోతే పాపంఎదురవుతూ ఉంది. మొలలోతు నీళ్ళల్లో తలమునిగేవరకు ముంచి, ఊపిరాడకుండా చేసి తీరా ఆ కాస్త ఊపిరిపోబోయేటప్పుడు 'పోనీలే!' అని దయతలచి వదిలిపెడుతూ ఉన్నాయి. తానుచేసిన తప్పేమి? తన్ను తన పుట్టుకను శంకించి నోటితో నవ్వుతూ నొసటితో వెక్కిరించే లోకాన్ని వదిలిరావడం తప్పా? కండ్లముందు జరిగే అన్యాయాలకు అడ్డుపడింది తప్పా? ముత్యాలు తన ఆలోచన తనదిగా ఉంటే నీలమేఘాన్ని, ఆయన పంతాన్ని పూర్తిగా మరిచిపోయాడు.

"ఓ!... వీడా?" మాట, మాట వెంబడి నవ్వు, ఒకదాన్ని ఒకటి తరుముతున్నట్లుగ ఊడిపడ్డాయి– ఉన్నట్టుండి! ఉలిక్కిపడి లేచినిలబడ్డాడు ముత్యాలు. ఎదురుగా పోలీసు ఆఫీసర్ నవ్వుతున్నాడు. ఆ నవ్వులో పరిచయస్తుణ్ణి గుర్తించిన పట్టు, పోలీసు ఆఫీసరు బెట్టు పంతాలు పోతున్నాయి! 'చూశావా నా దెబ్బ?' అని చూపులతోనే గుచ్చి గుచ్చి అడుగుతున్నాడు నీలమేఘం!

ఒక సారి చేతిలో డైరీని, మరొక సారి ముత్యాలుని చూశాడు పోలీసు ఆఫీసర్. సందేహానికి తావు లేకపోతే విచారణకు అవసరమే లేకపోయింది. 'ఊఁ! అన్నాడు పోలీసు దొర. ముందు వెనకాడకుండా ముంజేతులకు కంకణాలు తొడిగారు పోలీసులు. తమ పాత చుట్టాన్ని గుర్తించడంలో వాళ్ళేమీ పొరపాటు పడలేదు. హత్యాయత్నం నిందతో "అత్తగారింటి ఆదరణ" ఆరేళ్ళు అతన్ని వదిలి పెట్టలేదు!...

ఆరేళ్ళ తర్వాత మళ్ళీ జైలునుంచి బయటపడ్డాడు ముత్యాలు. బయటపడిందే తడవుగా నడుస్తున్నాడు. గతాన్ని నెమరేసుకొంటూ అయోమయమైన భవిష్యత్తును గురించి ఆలోచిస్తూ నడుస్తున్నాడు.

అయితే మాత్రం ఎంతకాలమని అలా కాలంతో పోటీపడ్తూ నడస్తాడు?

ఓ పల్లెముందు చెట్టుక్రింద కూర్చున్నాడు ముత్యాలు. పొద్దు గూట్లో పడుతూ పడుతూఉంది. మేతకోసం రెక్కల కొద్దీ ఎగిరి, దేశమంతా గాలించి, పొట్టనింపుకొన్న పక్షులు గూళ్ళు చేరడానికి గుంపులు గుంపులుగా వస్తున్నాయి. అడవికి మేతకు వెళ్ళిన ఆలమందలు ఇంటి ముఖంపట్టాయి. గవిన్లో ఎదురుపడిన లేగదూడలను శరీరమంతా నాకుతున్నాయి అప్యాయంగా! పొలంనుండి అరమూట ధాన్యాన్ని మోయలేక మోసుకొస్తున్న మగనికి ఎదురైన మగువ ఆ మూటందుకుంటే... అతగాడు మెదవిరుచుకొంటూ... కొంటెచూపులు కురిపిస్తున్నాడు. ఆ

చెట్టు కిందనే కంసాలి కొలిమి. బూడిదంతా తీసి ఆ పక్కన్నే గుట్టగా పోశారు. ఆ బూడిదలో పడుకొనింది ఓ కుక్క. నాలుగైదు చంటిపిల్లలు పాలు జుర్రు కొంటుంటే ఎంతో అప్యాయంగా పిల్లలవైపు చూస్తూ మైమరచి పడిఉంది. అన్నిటినీ పరిశీలించి చూశాడు ముత్యాలు. లోకమంతా ప్రేమమయంగా కనబడుతూ ఉంది. ఇంత కరుణామయమైన ప్రపంచంలో తనకు కాసంత చోటు దొరక్కపోదులే అన్న ఆశ చీకట్లో చిరుదివ్వె!

ఆ ఆశతోనే మూడామడలు కాళ్ళీడ్చుకొంటూ నడిచిన ముత్యాలు కూలబడ్డాడు ఆ వెలగ చెట్టు కింద గుంటలో గుక్కెడు నీళ్ళు తాగి. అప్పుడు తన కంటపడింది ఆ పదేళ్ళ కుర్రవాడు. వాణ్ణి చూస్తుంటే గుండెలు తరక్కపోతున్నాయి. తన్ను గురించి ఆలోచించే వాళ్ళు లేరని మనసు తనకలాడుతుంటే తాను ఇంకొకడిని గురించి ఆలోచిస్తున్నాడు!

పాపం! వాడూ తనలాగే వీధులపాలై ఉంటాడు. కంటికి నున్నగా కనిపించిన వాడినంతా "చదువుకోవాలి! తల్లీ తండ్రి ఎవ్వరూలేరు. సాయంచేయండి" అని బ్రతిమాలి ఉంటాడు. అది ఫలించకపోగా, పని కోసం ప్రాధేయపడి ఉంటాడు. " ఊరూ పేరూలేని వెధవలకు పనెవరిస్తారు? పోరా!!" అని కసిరికొడ్తే తిట్లకు, చీవాట్లకు అలవాటుపడి కడకు ఆడక్క తినడానికి తయారయి ఉంటాడు. నాలాంటి, ఇలాంటి దౌర్భాగ్యులెందరున్నారో ఈ లోకంలో? అబ్బ! ఎంత దైన్యం గూడు కట్టుకొని ఉంది ఆకళ్ళలో! ఎన్ని కన్నీళ్ళు నిట్టూర్పు సెగలతో ఆవిరైపోయాయో ఆ చెక్కిళ్ళపై!...

దారిన పోతూ ఉండిన ఆ పదేళ్ళ పిల్లవాణ్ణి గురించి ఆలోచనా స్రవంతి గుండెల్లో పొంగి తన జీవితంతో ఓ సమన్వయాన్ని కుదుర్చుకొనేసరికి ఏదో అవ్యక్తమైన సానుభూతి ఆ కుర్రవాడి భవిష్యత్తుపై తన్ను వీపుతట్టితే పైకి లేవబోయాడు. మూన్నాళ్ళుగా ఒట్టి కడుపు. పైన కాసిన్ని మంచినీళ్ళు పడడం. పైత్యం ప్రకోపించిందేమో? వశం తప్పిన శరీరం తన మాటల్ని లెక్కచేయలేదు. కళ్ళు తిరుగుతున్నాయి. కాళ్లు తడబడుతున్నాయి. ఎట్లో నిబ్బరించుకొని 'బాబూ!' అంటూ ఒక్క అడుగు ముందుకు వేయబోయాడు. అంతే!....

ఎక్కడో అత్తగారి పోటుకుతో అల్లాడిపోయే ఓ మహాసాధ్వి తెగించి పిడికెడు మెతుకులు దోసిట్లో తెచ్చి విదిలిస్తే సంతృప్తిగా నవ్వుకొన్నాడు ఆ పదేళ్ళ కుర్రవాడు.

ఒక్క అడుగు ముందుకు వేయలేని నీరస స్థితిలో కుప్పగా కూలిపోయాడు ముత్యాలు, కాలచక్రం బడిదుడుకుల్లో చిక్కుకొని, ధక్కాముక్కీలు తిన్న తనువులాంటి ఎముకల గూడు నేలకు అతుక్కుపోతే, గూట్లో దివ్వెల్లా వెలిగే నిశితమైన చూపులు మాత్రం దేవులాడుతూనే ఉన్నాయి దేనికోసమో ?

ఏమనుకొనిందో ఏమో? లోకం నవ్వింది! ●

**భారతి**

(1, ఏప్రిల్ 1963)